ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 25-11-2026 **సమయం : 6.45 గంటలు**

ముఖ్యాంశాలు

1. రాజధాని అమరావతిలో ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.

2. ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన రెండవ సాధారణ ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరూ తమ ఎన్నికల ఖర్చుల వివరాలను సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది.

3. వివిధ రంగాల్లో 88 వేల 392 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించిన 18 ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం తెలిపింది.

4. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా తెలంగాణలోని హైదరాబాద్‌లో ఈ రోజు నుంచి 'వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో చైతన్య పాదయాత్ర నిర్వహించనున్నారు.

==========

రాజధాని అమరావతిలో ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇందుకు ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించాలని, ఇప్పటికే భూములు తీసుకున్న సంస్థలు వెంటనే కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 68వ సీఆర్‌డీఏ సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా 13 అంశాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణం బయటి నుంచి చూడటానికి ఐకానిక్‌గా ఉండాలని, టవర్ల లోపల వసతుల్ని విలాసవంతంగా కాకుండా, తక్కువ ఖర్చుతో ఏర్పాటయ్యేలా చూడాలని స్పష్టంచేశారు. రాజధానిలోని రహదారులన్నీ 5 ఏళ్లపాటు గుత్తేదారులే నిర్వహించాలన్నారు. దేశంలోని ప్రముఖ స్థిరాస్తి సంస్థలతో సమావేశాలు నిర్వహించి, అమరావతిలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల్ని వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాల్లో 88 వేల 392 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించిన 18 ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి – ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం నిన్న జరిగింది. ఈ సమావేశంలో పరిశ్రమలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, పర్యాటకం, ఇంధనం, ఆహార శు

ద్ధి, పారిశ్రామిక మౌలిక సదుపాయాల రంగాల్లో ఈ పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే రాష్ట్రంలో మొత్తం 54 వేల 210 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగానికి సంబంధించి అత్యధికంగా 49 వేల 541 కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదం తెలుపగా, ఇందులో బాలేవాడి టెక్‌పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి అనకాపల్లి జిల్లా తూటిపాల, మాకవరపాలెంలో 720 మెగావాట్ల సామర్థ్యంతో 47 వేల 9 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ కు ఆమోదం తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన రెండవ సాధారణ ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరూ తమ ఎన్నికల వ్యయానికి సంబంధించిన తుది వివరాలను వచ్చే నెల 21వ తేదీలోగా తప్పనిసరిగా సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సూచించారు. ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ నెల 7వ తేదీన ఎన్నికల ఫలితాలను ప్రకటించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం, ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఫలితాలు ప్రకటించిన తేదీ నుంచి 45 రోజుల్లోగా తన ఎన్నికల ఖర్చుల వివరాలను ఎన్నికల అధికారికి సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల వ్యయ వివరాలు సమర్పించేందుకు వచ్చే నెల 21వ తేదీ చివరి గడువుగా నిర్ణయించబడిందని స్పష్టం చేశారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా తెలంగాణలోని హైదరాబాద్‌లో ఈరోజు నుంచి మూడు రోజులపాటు 'వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో చైతన్య పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ క్రమంలో తోలి రోజైన ఈ రోజు అంబర్‌పేట నుంచి ముషీరాబాద్ వరకు పాదయాత్ర సాగనుంది. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడం, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొననున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ఖనిజ సంపదను ప్రపంచానికి చాటి చెప్పే లక్ష్యంతో వచ్చే నెల 10వ తేదీ నుంచి 4 రోజుల పాటు విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ స్టోన్ ఫెస్ట్ – 2026 నిర్వహిస్తున్నట్లు గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. దేశంలో మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ఇటువంటి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన నిన్న చేసిన వీడియో సందేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్...27 సెకన్లు

వ్యవసాయ రంగాన్ని మరింత ఆధునికంగా, లాభసాటిగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన శాఖలపై అధికారులతో ఆయన నిన్న సమీక్ష

నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇటీవల సంభవించిన వరుస తుఫాన్లు, ఎల్‌నినో విపత్తుల వంటి ప్రకృతి వైపరీత్యాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో పంట నష్టాన్ని నివారించేలా సాగు విధానాల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు సహకారంతో సుమారు 40 వేల కోట్ల రూపాయల నిధులను సమీకరించాలని, మిగిలిన 60 వేల కోట్ల రూపాయలను వివిధ పెట్టుబడుల ద్వారా సమకూర్చుకుని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

గోవాలో జరుగుతున్న 57వ అంతర్జాతీయ భారతీయ చలనచిత్రోత్సవం – ఇఫిలో భాగంగా నిర్వహించిన క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో 6వ ఎడిషన్ నిన్న ఘనంగా ముగిసింది. ఈ పోటీలో మోహక్ గాంధీ దర్శకత్వం వహించిన 'వన్ లాస్ట్ స్టాప్' ఉత్తమ చిత్రంగా ఎంపికై ఐదు లక్షల రూపాయల నగదు బహుమతిని గెలుచుకుంది. తమన్నా ఠాకూర్ దర్శకత్వం వహించిన 'ఎ లిటిల్ సమ్‌థింగ్' రన్నరప్‌గా నిలిచి మూడు లక్షల రూపాయల నగదు బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ప్రభాత్ మాట్లాడుతూ.. యువ ప్రతిభావంతులకు, చలనచిత్ర పరిశ్రమకు మధ్య క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో ఒక వారధిగా పనిచేస్తోందని అన్నారు. ఈ ఏడాది పోటీకి 'మన మూలాలను గౌరవిస్తూ, భవిష్యత్తును ఆహ్వానిస్తూ' అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇది సాంస్కృతిక వారసత్వం, నూతన ఆవిష్కరణలు, సాంకేతికతల సమ్మేళనాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన ఫెస్టివల్ డైరెక్టర్ ఆశుతోష్ గోవారికర్ మాట్లాడుతూ.. సినిమా నిర్మాణం అనేది ఒక సమష్టి కృషి అని, ఒక్క వ్యక్తితో సినిమా తీయడం సాధ్యం కాదన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొలివిడత ఎన్నికలు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీల్లో, 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రచారానికి గడువు నిన్న సాయంత్రం 5 గంటలతో ముగిసింది. మరోవైపు ఆయా గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో గురువారం జరిగే పోలింగ్‌కు అధికారులు ఏర్పాటు ముమ్మరం చేశారు. పొలింగ్‌కు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేశారు. ఈరోజు సాయంత్రానికి ఆయా పోలింగ్ బూత్‌లలో అధికారులకు సామాగ్రి పంపిణీ పూర్తి చేసి పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలివిడతతో ఏకగ్రీవాలు మినహా 3 వేల 191 సర్పంచి స్థానాలకు, 25 వేల 105 వార్డు సభ్యుల స్థానాలకు రేపు ఎన్నికలు నిర్వహించనున్నారు.

నైరుతి బంగాళాఖాతం నుండి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. కొమొరిన్ ప్రాంతం నుండి రాయలసీమ వరకు, అంతర్గత తమిళనాడు మీదుగా మరో ద్రోణి విస్తరించి ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎస్. వి జగన్నాధ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య తూర్పు గాలులు వీస్తున్నాయని ఆయన పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

==========